సాక్షి ఆదిలాబాద్

శనివారం । 4 । మే । 2024



ట్రిపుల్ఐటీ నోటిఫికేషన్ ఎప్పుడో?

బాసర ట్రిపుల్ఐటీలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్ల స్వీకరణకు ఇంకా నోటిఫికేషన్ వెలువడలేదు. ఏప్రిల్ 30న పది ఫలితాలు విడుదలయ్యాయి. IIలో▸



అప్రమత్తంగా ఉండాలి

బోథ్: బోథ్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ గౌస్ ఆలం శుక్రవారం సందర్శించారు. ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ రమేశ్కు సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 44.0 /26.0

మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. వడ గాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డీఎల్ఎస్ఏ కార్యదర్శి బాధ్యతలు స్వీకరణ



డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా న్యాయసేవ అధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శిగా బి.సౌజన్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన క్షమాదేశ్ పాండే బదిలీపై ఇతర జిల్లాకు వెళ్లిన విషయం తెలిసిందే. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శికి బార్ అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగేశ్, ఎంబడి సంతోష్ కుమార్, ఉపాధ్యక్షురాలు రజితరెడ్డి, కోశాధికారి రమణయ్య, స్పోర్ట్స్ సెక్రెటరి ముజాహిద్ హుస్సేన్, మహిళా సభ్యురాలు తిలోత్తమ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

నార్నూర్: బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరమని డీసీపీవో టి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. గాదిగూడ మండలంలోని లోకారి కే గ్రామ రైతు వేదికలో బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నతనంలో వివాహాలు చేయడం ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. బాల్య విహహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందులో ఎంపీడీవో రమేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రదీపిక, ఉమ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలి

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 6 నుంచి నిర్వహించనున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్లెల మనోజ్ ప్రకటనలో కోరారు. జిల్లాలో ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు సుమారు 46 డిగ్రీలకు చేరువైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ పరీక్షలను వాయిదా వేసి జూన్‌లో నిర్వహించాలని కోరారు.

వసతులు కల్పించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హెచ్ఎం అసోసియేషన్ ప్రతినిధులు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బందికి ఇబ్బందులు కలుగకుండా తగు వసతులు కల్పించాలని రాష్ట్ర గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజఫర్ హుస్సేన్, సూర్యకాంత్‌లు శుక్రవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున మే 13న ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో కూలర్లు, చల్లని తాగునీరు, ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలింగ్ సమయం గంట పెంపు

కైలాస్‌నగర్: ఈనెల 13న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని ఒక గంట పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జా రీ చేసినట్లు ఎన్నికల అధికారి రాజర్షి షా తెలిపారు. ప్రతి సాధారణ ఎన్నికల్లో పోలింగ్ సమయం ఉదయం 7నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండగా, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పోలింగ్ సమయాన్ని ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ సమయం పెంపుతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముధోల్, ఖానాపూర్‌లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, ఆసిఫాబాద్, సిర్పూర్‌లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని ఆయా ప్రాంతాల ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రచండమే!

- జిల్లాలో పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- బేలలో 44.9 డిగ్రీలుగా నమోదు
- నిర్మానుష్యంగా రహదారులు
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి

జిల్లాలో మూడు రోజులుగా నమోదైన కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లో)

తేది	కనిష్ట	గరిష్ట
మే 1న	26.2	42.8
2న	23.7	42.3
3న	20.2	44.9



నిర్మానుష్యంగా మారిన జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్



స్కార్ఫ్ కట్టుకొని స్కూటీపై వెళ్తున్న యువతి

ఆదిలాబాద్‌టౌన్: మే రాకతో జిల్లా నిప్పుల కుంపటిగా మారింది. ఇప్పటికే 44 డిగ్రీల మార్కు దాటింది. భానుడి ప్రతాపానికి జనం విలవిల్లాడుతున్నారు. బాబోయ్ ఇవేం ఎండలు అంటూ బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 దాటిందంటే గడప దాటేందుకు జంకుతున్నారు. అవసరం ఉంటే తప్పా మధ్యాహ్న సమయంలో బయటకు రావడం లేదు. జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో ముఖ్య కూడళ్లు పగటి పూట నిర్మానుష్యంగా మారుతున్నాయి. అప్రకటిత కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. సాయంత్రం వరకూ ఎండ తీవ్రత తగ్గడం లేదు. శుక్రవారం బేలలో 44.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవడం గమనార్హం.

ఉపశమనం కోసం ఆరాటం..

జిల్లాలో ఒక్కసారిగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ఎండ వేడిమి తట్టుకోలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలకు అతుక్కుపోతున్నారు. తప్పనిసరిగా బయటకు వెళ్లే వారు తలకు రక్షక కవచాలు ధరిస్తున్నారు. మరోవైపు శీతల పానియాలు, కొబ్బరి బోండాలకు గిరాకీ పెరిగింది.

రాజకీయ నాయకుల తంటాలు..

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆయా పార్టీల నాయకులు ప్రచారం ముమ్మరం చేశారు. ఎండలు సైతం లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో వడదెబ్బకు గురైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మరో వైపు ఉదయం, సాయంత్రం వేళల్లోనే ప్రచారం చేపట్టేందుకు నేతలు మొగ్గుచూపుతున్నారు. అయితే సాయంత్రం కూడా వడగాలులు వీస్తున్నాయి. అయినా తమ పార్టీ గెలుపు కోసం శ్రేణులంతా గడప గడపకు తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

జర పదిలం..

జిల్లాలో ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎండలో పని చేసే, తిరిగే వారు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉంటాయని పేర్కొంటున్నారు. అత్యవసరం అయితే తప్పా ఎండలో బయటకు వెళ్లకూడదని చెబుతున్నారు. ఎక్కువ సమయంలో ఎండలో తిరిగితే శరీరంలో ప్రొటీన్ స్థాయి తగ్గిపోయి అవయవాలు పనిచేయడం ఆగిపోతాయని, శరీర ఉష్ణోగ్రతలు మామూలు స్థితిలో ఉండేలా చూసుకోవాలని పేర్కొంటున్నారు. వృద్ధులు, చిన్నారుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా అందరూ అప్రమత్తంగా ఉండాలి. అవసరం ఉంటే తప్పా ఇంటి నుంచి బయటకు వెళ్లకూడదు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ప్రతిరోజు కనీసం 5 లీటర్ల నీటిని తాగడం మంచిది. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

ఆ ముగ్గురి చేరిక నిలిపివేత

- ఉత్తర్వులు జారీచేసిన జగ్గారెడ్డి
- కాంగ్రెస్‌లో ఫలించిన 'కంది' వర్గీయుల పోరాటం

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్‌లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఆరేళ్లపాటు పార్టీ బహిష్కరణకు గురైన జిల్లా కేంద్రానికి చెందిన పీసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ గండ్రత్ సుజాత, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డిల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇటీవల జగ్గారెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న ఈ ముగ్గురు ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని కూడా కలిశారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించి పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఈ ముగ్గురు నాయకులను తిరిగి పార్టీలో చేర్చుకోవద్దంటూ కంది శ్రీనివాసరెడ్డి మద్దతుదారులు ఆందోళన చేపట్టారు. వెంటనే వారిని పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ ముగ్గురు నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ దహనం చేయడంతో పాటు నోటికి నల్లగుడ్డలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను గమనించిన పార్టీ నాయకత్వం వారి చేరికలను నిలిపివేస్తున్నట్టుగా ప్రకటించింది. దీంతో కంది వర్గీయుల పోరాటం ఫలించినట్లైందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి ఆదేశాల మేరకు ఆ నాయకుల చేరికలను నిలిపివేస్తున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, చేరికల కమిటీమెంబర్ జయప్రకాష్ రెడ్డి(జగ్గారెడ్డి) శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నాయకత్వంతో చర్చించి త్వరలోనే తగు నిర్ణయం తీసుకుంటామని అప్పటి వరకు వారి చేరిక నిలిపివేస్తున్నట్లుగా అందులో పేర్కొన్నారు.



TELANGANA PRADESH CONGRESS COMMITTEE

T. JAYAPRAKASH REDDY
Working President

FOR FAVOR OF PUBLICATION – 3-5-2024

As per the advice of Smt. Deepa Dasmunshi, AICC General Secretary (In-Charge of Telangana), the admissions/joining's of Shri Sajid Khan, former DCC President, Smt. Gandrath Sujatha, former PCC General Secretary and Shri A. Sanjiva Reddy, Adilabad district are kept in abeyance.

After the consultations with the district leaders of Adilabad, the decision may be taken at an early date.

Hence, the joining's/admissions of Shri Sajid Khan, former DCC President, Smt. Gandrath Sujatha, former PCC General Secretary and Shri A. Sanjiva Reddy, Adilabad district have been kept in abeyance till further orders.

T. JAYAPRAKASH REDDY
Working President, TPCC &
Member, PCC Joinings Committee

చేరికలను నిలిపివేస్తున్నట్లు జగ్గారెడ్డి జారీ చేసిన ఉత్తర్వు ప్రతి

పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ షురూ



ఆదిలాబాద్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగులు



పట్నాపూర్‌లో హోంఓటింగ్ ద్వారా ఓటు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

బోథ్: ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్‌తో పాటు, దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వారికి హోం ఓటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఎన్నికల సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే దివ్యాంగులు, 85ఏళ్లు పైబడిన వారి కోసం హోం ఓటింగ్‌లో భాగంగా అధికారులు వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఓటింగ్ నమోదు చేశారు.

- ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో తొలిరోజున 310 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే దివ్యాంగులు 108 మంది, వయోవృద్ధులు ఏడుగురు హోం ఓటింగ్‌లో భాగంగా ఓటు వేశారు.
- బోథ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొలిరోజున 22 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే వయో వృద్ధులు, దివ్యాంగులు 95మంది హోంఓటింగ్ ద్వారా ఓటు వేశారు. శుక్రవారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్, హోంఓటింగ్ ప్రక్రియ ఈ నెల 8వరకు కొనసాగనుంది.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి కలెక్టర్, ఎస్పీ..

బోథ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ గౌస్ ఆలం పరిశీలించారు. అనంతరం మండలంలోని పట్నాపూర్ గ్రామంలో హోం ఓటింగ్‌ను పరిశీలించారు. వారి వెంట ఎన్నికల సిబ్బంది, అధికారులు ఉన్నారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న పార్టీలను ఓడిద్దాం

- మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి



బోథ్‌లో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

బోథ్: రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, అబద్ధపు, విద్వేష, విభజన రాజకీయాలు చేసే పార్టీలను ఓడించాలని మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి అన్నారు. జాగో తెలంగాణ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య బస్సుయాత్ర శుక్రవారం సాయంత్రం బోథ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు ఆదివాసీలకు చేసిందేమి లేదన్నారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీలను ఓడించాలన్నారు. కాగా, బీజేపీని విమర్శించడాన్ని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు అడ్డుకున్నారు. ఓటరు చైతన్య యాత్ర పేరుతో రాజకీయాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఓటర్లను చైతన్య పరచాలే గాని బీజేపీని విమర్శిస్తూ, కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం చేయడం సరికాదన్నారు. మురళితో పాటు బృందం సభ్యులు బస్సులో తిరిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో మాజీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, నైనాల గోవర్ధన్, దేవిదాస్, రాయదాస్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దండే విఠల్ ఎన్నిక చెల్లదు

- హైకోర్టు సంచలన తీర్పు.. రూ.50వేల జరిమానా కూడా
- సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ
- అప్పట్లో ఎన్నిక బరిలో నిలిచేందుకు రాజేశ్వర్‌రెడ్డి నామినేషన్
- ఫోర్జరీ సంతకాలతో ఉపసంహరింపజేశారని కోర్టును ఆశ్రయించిన వైనం



ఎమ్మెల్సీ దండే విఠల్



పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి

సాక్షి,ఆదిలాబాద్: ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెల్లడించింది. అంతే కాకుండా రూ.50వేల జరిమానా కూడా విధించింది. నిర్మల్ జిల్లా సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి గతంలో దండే విఠల్ ఎన్నికపై హైకోర్టును ఆశ్రయించాడు. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేసేందుకు నామినేషన్ వేసినప్పటికీ, తన ప్రమేయం లేకుండానే ఫోర్జరీ సంతకాలతో నామినేషన్ ఉపసంహరించారని, ఎన్నికల అధికారులు సైతం తన నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు ప్రకటించారని పత్తిరెడ్డి అప్పట్లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. వాదోపవాదాలు పూర్తయిన తర్వాత తాజాగా న్యాయస్థానం ఈ తీర్పు వెల్లడించింది.

వివాదం ఇలా..

ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 2021, డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో 24 మంది అభ్యర్థులు ఈ ఎన్నిక కోసం నామినేషన్లు దాఖలు చేశారు. అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థిగా దండె విఠల్ బరిలో నిలవగా, అదే పార్టీకి చెందిన నిర్మల్ జిల్లా సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి కూడా పార్టీ ఆదేశాలు ధిక్కరించి నామినేషన్ వేశాడు. పోటీ అభ్యర్థులను నామినేషన్ల ఉపసంహరణ ద్వారా విఠల్ ఎన్నిక ఏకగ్రీవం చేయాలని అప్పట్లో పార్టీ పరంగా ప్రయత్నాలు జరిగాయి. ఉపసంహరణ ప్రక్రియరోజు 22మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. బీఆర్ఎస్ అభ్యర్థి దండే విఠల్, తుడుందెబ్బకు చెందిన పెందూర్ పుష్పరాణి స్వతంత్ర అభ్యర్థి నామినేషన్లు మాత్రమే మిగిలినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. పోలింగ్ తర్వాత ఫలితాల్లో విఠల్ భారీ ఆధిక్యంతో గెలిచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాడు. అయితే పత్తిరెడ్డి ఈ ఎన్నికపై హైకోర్టును ఆశ్రయించాడు. తాను నామినేషన్ ఉపసంహరించుకున్నట్టు ఫోర్జరీ పత్రాలు సృష్టించినట్లు పిటిషన్ వేశాడు. దీనిపై విచారణ కొనసాగుతూ వచ్చింది. నామినేషన్ ఉపసంహరణ పత్రంపై సంతకాలు తనవి కాదని పత్తిరెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ఆ పత్రాలను మధ్యలో ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని హైకోర్టు అప్పట్లో ఆదేశించింది. ఆ సంతకాలను పోల్చి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. రామంతాపూర్ సీఎఫ్ఎస్ఎల్‌కు పత్రాలు పంపాలని రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ పత్రాలపై సంతకాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పోల్చి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. వీటన్నింటి పరిశీలన తర్వాత తాజాగా ఈ తీర్పు వెల్లడించింది.

మారిన రాజకీయ పరిస్థితులు..

అప్పటికి ఇప్పటికీ రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగినప్పుడు బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలో ఉండగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహించారు. అప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థిగా దండే విఠల్‌ను ప్రకటించినప్పటికీ పార్టీ ఆదేశాలు ధిక్కరిస్తూ ఇదే పార్టీలో ఉన్న సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి కూడా నామినేషన్ వేశాడు. ఉపసంహరణ విషయంలో అప్పుడు మంత్రిగా ఉన్న ఇంద్రకరణ్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ పత్తిరెడ్డి దిగిరాలేదు. ఇదిలా ఉంటే ఆరోజు 24 మందిలో 22 మంది నామినేషన్ ఉపసంహరించుకున్నారని ఎన్నికల అధికారులు ప్రకటించారు. అందులో పత్తిరెడ్డి కూడా ఉన్నట్టు కూడా తెలిపారు. అయితే తన ప్రమేయం లేకుండానే ఫోర్జరీ సంతకాలతో తన నామినేషన్‌ను బీఆర్ఎస్ నేతలు ఉపసంహరింపజేశారని ఆయన ఆరోపించాడు. దీనిపై హైకోర్టును ఆశ్రయించాడు. తాజాగా తీర్పు వెలబడింది. కాగా ప్రస్తుతం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఇద్దరూ కాంగ్రెస్‌లోనే ఉండటం గమనార్హం.


సుప్రీం కోర్టుకు వెళ్తా..

- ఎమ్మెల్సీ దండే విఠల్

కౌటాల/చింతలమానెపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో తన ఎన్నిక చెల్లదని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టుకు వెళ్తానని ఎమ్మెల్సీ విఠల్ తెలిపారు. హైకోర్టు తీర్పుపై శుక్రవారం చింతలమానెపల్లి మండలం బాలజీఅనుకోడ గ్రామంలో స్పందించారు. హైకోర్టు తీర్పు తనను విస్మయానికి గురి చేసిందన్నారు. కేసు నమోదు చేసినవ్యక్తి నామినేషన్ ఉపసంహరణలో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. తీర్పుపై అప్పీల్‌కు వెళ్లేందుకు హైకోర్టు తనకు నాలుగు వారాల గడువు ఇచ్చిందని తెలిపారు. సుప్రీం కోర్టులో తనకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యూహాలకు పదును

- ప్రచారంపై ఫోకస్ పెంచిన ప్రధాన పార్టీలు
- ఎంపీ సోయం టికెట్ అంశాన్ని తెరపైకి తెచ్చిన సీఎం
- ఆదివాసీ ఓట్లను ఆకర్షించేందుకేననే అభిప్రాయం
- విభేదాలకు చెక్ పెట్టేలా బీజేపీ కార్యాచరణ
- మైనార్టీ ఓట్లపై బీఆర్ఎస్ దృష్టి



సాక్షి,ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల సంగ్రామంలో ఆయాపార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఈ సెగ్మెంట్ పరిధిలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌లలో జరిగిన సభల్లో వ్యూహాత్మకంగా బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు గొడం నగేశ్, ఆత్రం సక్కును విమర్శించడం ద్వారా ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఎంపీ సోయం బాపూరావు ప్రస్తావన కూడా ఇందులో భాగమేనని చర్చించుకుంటున్నారు. మరోపక్క బీజేపీలో ఇటీవల ఎమ్మెల్యేలకు ఆయా పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతలు తొలగించిన తర్వాత వారంతా తమ నియోజకవర్గాల్లో ప్రచారంలో దూకుడు పెంచారు. ఒక విధంగా ఈ నిర్ణయం విభేదాలకు చెక్‌తో పాటు ప్రచారంలో స్పీడ్ పెంచేందుకు ఉపయోగపడిందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ మైనార్టీ ఓట్లపై దృష్టి సారించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

సీఎం ప్రసంగంలో ఎంపీ సోయం ప్రస్తావన..

సీఎం రేవంత్‌రెడ్డి ఆసిఫాబాద్ బహిరంగ సభలో ఎంపీ సోయం బాపూరావు ప్రస్తావన తీసుకురావడం వ్యూహాత్మకమేనన్న చర్చ సాగుతుంది. సిట్టింగ్ ఎంపీ సోయంకు టికెట్ ఇవ్వకుండా బీజేపీ ఆయనను అవమానించిందన్నారు. అంతేకాకుండా పార్లమెంట్ నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రుల చుట్టూ సోయం తిరిగినా వారు పట్టించుకోలేదని చెప్పారు. ప్రధానంగా సోయంకు ఆదివాసీ ఓటర్లలో పట్టు ఉంది. ఈ నేపథ్యంలో సీఎం వ్యూహాత్మకంగానే సోయం ప్రస్తావన తీసుకువచ్చారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అంతేకాకుండా బీజేపీ అభ్యర్థి నగేశ్, బీఆర్ఎస్ అభ్యర్థి సక్కు ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నప్పటికీ జిల్లా అభివృద్ధికి పాటుపడింది లేదని చెప్పడం ద్వారా విమర్శలు ఎక్కుపెట్టారు. ఇదిలా ఉంటే ఇటీవల మంత్రి సీతక్క, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ నార్నూర్ మండలం కొత్తపల్లి–హెచ్‌లో బంజారా దీక్షభూమి వేదిక వద్ద ప్రసంగిస్తూ తాము లంబాడాలకు వ్యతిరేకం కాదని చెప్పడం ద్వారా ఆ ఓటర్లను ఆకట్టునే ప్రయత్నం చేశారు. అంతే కాకుండా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి పార్టీ పరంగా కో ఇన్‌చార్జీలను నియమించారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌తో పాటు ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్ నియామకం ఇందులో భాగమేనని తెలుస్తోంది. తద్వారా ఆ సామాజిక వర్గ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నమే ఈ చర్య అన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతుంది.

బీజేపీలో విభేదాలు సమసినట్టేనా..

బీజేపీలో ఎంపీ అభ్యర్థిగా నగేశ్‌ను ప్రకటించిన తర్వాత పార్టీ ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేదన్న విమర్శలు జోరుగా సాగాయి. ఎమ్మెల్యేలకు పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చిన తర్వాత వారి నియోజకవర్గాల్లో ఇతర నేతల జోక్యం పెరిగిందన్న భావం వ్యక్తమైందన్న ప్రచారం జరిగింది. పార్టీ అధిష్టానం దృష్టికి కూడా వెళ్లడంతో నష్ట నివారణ చర్యలకు దిగింది. ఇందులో భాగంగానే పార్టీ ఎమ్మెల్యేలందరికీ ఆయా పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగించారు. ఈ పరిణామం తర్వాత ఆయా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ప్రచార స్పీడ్ పెంచారు. ఒకవిధంగా ఇది పార్టీకి మంచి జరిగిందేనన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అంతేకాకుండా నగేశ్ ఇటీవల ఖానాపూర్ నియోజకవర్గంలో పర్యటించినప్పుడు మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌తో కలిసి విస్తృతంగా తిరిగారు. ఇది లంబాడా ఓటర్లను ఆకర్షించేందుకు వ్యూహాత్మక చర్య అన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఎంఐఎం నేతను కలిసిన బీఆర్ఎస్ నాయకులు..

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుకు సంబంధించి ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని నియోజకవర్గాల్లో ఆయా నేతలు, కార్యకర్తలు విస్తృతంగా తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇటీవల మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి భైంసాలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ జాబిర్ అహ్మద్‌ను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానంగా మైనార్టీ ఓటర్లను రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో ఆదివాసీ, లంబాడా ఓటర్లతో పాటు గిరిజనేతర ఓటర్లను ఆకట్టుకునేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు.

క్లుప్తంగా

సామూహిక వివాహ వేడుకలు విజయవంతం చేయాలి



ఎమ్మెల్యేకు పత్రిక ఇస్తున్న అంద్ ఆదివాసీ పెద్దలు

ఇంద్రవెల్లి: మండలంలోని దస్నాపూర్ గ్రామంలో ఈ నెల 5వ తేదీన ఆంద్ ఆదివాసీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సామూహిక వివాహ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని సంఘం నాయకులు ముఖడే విష్ణు, కొటుడే పుండలిక్ పాటిల్ ఎమ్మెల్యేను కోరారు. శుక్రవారం ఉట్నూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు నివాసానికి వెళ్లి సామూహిక వివాహ వేడుకల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ నెల 5న ఉదయం 10.25 గంటలకు పూలాజీబాబా ధ్యాన్ మందిరంలో 11 జంటలకు సామూహిక వివాహాలు జరిపించనున్నట్లు తెలిపారు. నాయకులు మారుతి కరడే, ముఖడే విష్ణు, జావదే కేశవ్, హన్వతే సాధానంద్, ప్రకాశ్ కోటుడే తదితరులున్నారు.

బాసర దేవస్థానం ఉద్యోగ సంఘం కార్యవర్గం

భైంసా: బాసర దేవస్థానం ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నికైంది. దేవస్థానం పరిపాలన సిబ్బంది, వైదిక సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, వాగ్దేవి సొసైటీ హోంగార్డు సిబ్బంది అంతా సమష్టిగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ప్రవీణ్‌పాఠక్ (స్థానాచార్యుడు), అధ్యక్షుడిగా సంజీవ్‌పూజారి (ప్రధాన అర్చకుడు), ఉపాధ్యక్షులుగా మధన్‌దీక్షిత్, ముఖ్య అర్చక కార్యదర్శిగా డీ విలాస్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్ రాజేందర్, సీహెచ్ రాజేందర్, కోశాధికారులుగా శివరాజ్, చంద్రమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

భైంసాటౌన్: పట్టణంలోని శివాజీనగర్ ప్రాంతంలోగల ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా–నిర్మల్ రహదారి పక్కన శివాజీనగర్‌లో సద్దాం అనే వ్యక్తి పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచాడన్న సమాచారం మేరకు శుక్రవారం తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు 17 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మద్యం పట్టివేత



ఖానాపూర్: పట్టుకున్న మద్యంతో పోలీసులు

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలోని బెల్ట్‌షాపులో విక్రయించేందుకు అక్రమంగా తీసుకెళ్తున్న మద్యాన్ని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. రూ.22,850 విలువైన ఐదు కాటన్ల బీర్లతో పాటు 60 క్వార్టర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సారంగాపూర్: మండలంలోని బండ్రేవు తండాకు చెందిన జాదవ్ బాబూలాల్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం ఆయన ఇంటిపై దాడి చేశామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఇంట్లో తనిఖీ చేయగా ఎనిమిది లీటర్ల మద్యం పట్టుబడినట్లు పేర్కొన్నారు. దీని విలువ సుమారు రూ.8,500 ఉంటుందని తెలిపారు. ఈమేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కడెం: మండల కేంద్రానికి సమీపంలో శుక్రవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన అర్సం మహేశ్ బైక్‌పై రూ.17వేల విలువైన మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. మద్యం, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ట్రిపుల్‌ఐటీ నోటిఫికేషన్ ఎప్పుడో?



బాసర ట్రిపుల్‌ఐటీ కళాశాల

- ఏప్రిల్ 30న ఎస్సెస్సీ ఫలితాలు వెల్లడి
- ఏటేటా అడ్మిషన్ల స్వీకరణలో జాప్యం
- నిరీక్షిస్తున్న 'పది' ఉత్తీర్ణులైన విద్యార్థులు
- ఈసారి జూన్ 15లోపు పూర్తి చేసేనా?

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు అడ్మిషన్ల స్వీకరణకు నోటిఫికేషన్ వెలువడలేదు. ఏప్రిల్ 30న పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. మంచి జీపీఏ సాధించిన విద్యార్థులంతా ఎక్కడ చదవాలనే ఆలోచనలో పడ్డారు. ప్రధానంగా రాష్ట్రంలోని ఏకైక బాసర ట్రిపుల్‌ఐటీలో చదవాలని ఆసక్తి చూపేవారి సంఖ్యే ఎక్కువ. ఇక్కడే చదివించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తల్లిదండ్రులూ ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులంతా ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా దరఖాస్తు చేసుకునేందుకు ఎదురుచూస్తున్నారు. కానీ, ఇప్పటివరకు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం నోటిఫికేషన్ వెలువరించలేదు. ఏటా నోటిఫికేషన్ వెలువడడం, అడ్మిషన్ల ప్రక్రియ పూర్తవడం ఆలస్యమవుతూనే ఉంది.

ఏటా 30వేలకు పైనే దరఖాస్తులు

ఏటా అడ్మిషన్ల స్వీకరణకు ఆలస్యం జరుగుతుండడంతో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఇతర కోర్సుల్లో చేరుతున్నారు. నిర్దిష్ట పరిమితిలో ఉన్న సీట్లు భర్తీ కావడంతో ఇక్కడే సీటు దక్కుతుందన్న ఆశతో నిరీక్షించే విద్యార్థులకు ఇంటర్ తత్సమాన కోర్సుల్లో మంచి కాలేజీల్లో చదువుకునే అవకాశం దక్కడంలేదు. ఏటా ఆగస్టు, సెప్టెంబర్ వరకు ఈ ప్రక్రి య కొనసాగుతుంది. ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి ఏ టా 30వేల నుంచి 35వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇక్కడ వెయ్యి నుంచి 1,500 సీట్లు మాత్రమే ఉన్నాయి. సీటు దక్కని వి ద్యార్థులు ఇతర కోర్సుల్లో చేరుతున్నారు. కానీ.. మెరిట్ జాబితా వెలువడకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిరీక్షిస్తున్నారు. ఎలాగైనా తమ పిల్లలకు ట్రిపుల్ ఐటీలోనే సీట్లు దక్కుతాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. పోటీ పెరగడంతో ట్రిపుల్‌ఐటీలో సీటు రాక రాష్ట్రంలో పేరున్న కళాశాలల్లో చదువుకునే అవకాశంలేక ఏదో ఒక చోట అడ్మిషన్ తీసుకుని చదువుకుంటున్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు వెలువడిన మరుసటిరోజే ట్రిపుల్‌ఐటీ అ ధికారులు ప్రవేశాల నోటిఫికేషన్ వెలువరించాలి. ద రఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే జాబితా వెలువరి స్తే మిగతా విద్యార్థులు తమకు సీటు రాలేదని మ రో కోర్సులో చేరేందుకు అవకాశం ఉంటుంది. కా నీ.. ఏటా ఇక్కడి అధికారులు విద్యాసంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియను కొంత ఆలస్యం చేస్తున్నారు.

ఏర్పాటు కాని కమిటీ

బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థుల ప్రవేశాల కోసం అడ్మిషన్ కమిటీ ఇప్పటివరకు ఏర్పాటు కానట్లు సమాచారం. గతేడాది ఉన్న కమిటీనే కొనసాగిస్తారా? లేదా కొత్త కమిటీ వేస్తారా? అనే విషయంపై స్పష్టత రావడంలేదు. ఏప్రిల్ 30న పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. అయితే ఈసారి 1,500 సీట్లు ఉంటాయో.. వెయ్యి సీట్లకు కుదిస్తారో.. అనే విషయం తెలియడంలేదు. 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ట్రిపుల్ ఐటీని ప్రారంభించారు. 2008లో 2వేల సీట్లతో ట్రిపుల్‌ఐటీ కళాశాల ప్రారంభమైంది. రెండేళ్లకే ఉమ్మడి రాష్ట్రంలో ఈ సీట్లు సగానికి తగ్గించి వెయ్యి మందికి అడ్మిషన్లు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వెయ్యి సీట్లతోనే అడ్మిషన్లు తీసుకున్నారు. 2018లో మరో 500 పెంచి అప్పటి నుంచి ఏటా 1,500 సీట్లు కేటాయించారు. మళ్లీ ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం 1,500 సీట్లను కొనసాగిస్తుందా.. మళ్లీ వెయ్యి సీట్లకే కుదిస్తుందా.. లేక ప్రారంభంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి లాగా 2,000 సీట్లకు పెంచుతుందా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

గ్రామీణ విద్యార్థులకే ప్రాధాన్యం!

2024–25 విద్యాసంవత్సరంపై ప్రభుత్వం దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలోనైనా ట్రిపుల్ ఐటీ కళాశాలలో పరిస్థితి మెరుగుపడాలని ఆశిస్తున్నారు. ఏటా విద్యార్థులు ఎన్నో ఆశలతో ట్రిపుల్‌ఐటీలో అడుగుపెడుతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకే ట్రిపుల్‌ఐటీలో అత్యధిక సీట్లు దక్కుతున్నాయి. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా పీయూసీ–1 విద్యాభ్యాసం, హాస్టల్ వాతావరణం ఉండేలా చూడాలని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ఎంతో ఆశగా వస్తున్న విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో ఉన్న పరిస్థితులను చూసి భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రవేశాల సమయంలోనే ప్రభుత్వం కొత్త విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వారి ఆలోచనలకు తగ్గట్లు పీయూసీ–1, పీయూసీ–2 చదువులు పూర్తయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రెండేళ్ల పీయూసీ, మరో నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సుల్లో ఇక్కడ బోధిస్తారు. కళాశాల ప్రారంభంలోనే ప్రభుత్వం దృష్టిసారించి వారి ఆలోచనలకు తగ్గట్లుగా అడుగులు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం



తండ్రి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు నాణ్యమైన సేవలు అందుతున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ఆయన తండ్రిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి శస్త్ర చికిత్స చేయించారు. శుక్రవారం ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు జబ్బు చేస్తే స్వయంగా సర్కారు దవాఖానకు వెళ్లి వైద్యం చేయించుకుంటానని తెలిపారు. తన తండ్రిని కూడా రిమ్స్‌లో చేర్పించి చికిత్స చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న తన తండ్రికి వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకరించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు కల్పిస్తోందని వివరించారు.

'మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్'



మాట్లాడుతున్న నాయకులు

ఇంద్రవెల్లి: తెలంగాణలో మూడు ఎస్సీ పార్లమెంట్ స్థానాల్లో మాదిగలకు కాంగ్రెస్ ఒక్క స్థానం కూడా ఇవ్వకుండా మోసం చేసిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ మాదిగ ఆరోపించారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగలంతా ఏకమై పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మాదిగలను అన్ని విధాలుగా మోసం చేస్తూ వచ్చాయని పేర్కొన్నారు. మాదిగలకు న్యాయం జరగాలంటే బీజేపీకు పట్టం కట్టాలని కోరారు. నేడు హైదరాబాద్‌లో జరిగే మాదిగల మహాధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధికార ప్రతినిధి నాతరి రాజు మాదిగ, జిల్లా కార్యదర్శి దాసరి రాంప్రసాద్ మాదిగ, మండల ఇన్‌చార్జి విక్రమ్ మాదిగ, నాయకులు సాయిమాదిగ, మాధవ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి సీపీఎం మద్దతు



ఐక్యత చాటుతున్న నాయకులు, అభ్యర్థి సుగుణ

ఆదిలాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా సీపీఎం పనిచేస్తోందని పార్టీ రాష్ట్ర నాయకుడు జే వెంకటేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో శుక్రవారం నిర్వహించిన పార్లమెంట్ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశానికి ఒరిగిందేమీలేదని, సీసీఐ పరిశ్రమ తెరిపించలేదని, కొత్త పరిశ్రమలు నెలకొల్పలేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని, భారీ మెజార్టీతో గెలిపించేలా పార్టీ శ్రేణులు మద్దతుగా ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తొడసం భీంరావు, నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, సంకె రవి, కుశాన రాజన్న, దుర్గం నూతన్‌కుమార్, లంక జమున, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్ పాల్గొన్నారు.

తలసేమియాపై అవగాహన ఉండాలి

మంచిర్యాలటౌన్: తలసేమియా, సికిల్‌సెల్‌ను నివారించేందుకు ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, పెళ్లికి ముందు హెచ్‌బీఏ 2 రక్త పరీక్షలు చేసుకుని పూర్తిగా నివారించవచ్చని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి సూచించారు. మే 8వ తేదీన ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఇద్దరు వ్యాధితో ఉన్న వారు పెళ్లి చేసుకోవద్దని, ఒక్కరు వ్యాధితో ఉండి, మరొకరు వ్యాధి లేనివారు పెళ్లి చేసుకుంటే పుట్టబోయే సంతానం 50 శాతం మంచి పిల్లలు, మరో 50 శాతం వ్యాధితో జన్మిస్తారని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కే భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులు హిమోగ్లోబిన్ 9.5 గ్రాములు ఉండేలా చూసుకోవాలని, ఆరోగ్యశ్రీ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బోన్‌మ్యారో మార్పిడి ద్వారా మాత్రమే వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఫాతిమా జూలియట్, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, లెక్చరర్ పద్మ, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ చందూరి మహేందర్, కోశాధికారి కే సత్యపాల్‌రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు చుంచు శంకరయ్య ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



యోగేశ్ (ఫైల్)

కుంటాల: మండలంలోని లింబా(బీ) గ్రామానికి చెందిన యోగేశ్ (22) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇచ్చోడ: మండలంలోని ఎల్లమ్మగూడ గ్రామానికి చెందిన సాజిత్ (18) గురువారం మేడిగూడ వద్ద జరిగిన బైక్, కారు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సాజిత్ సమీప బంధువుల పెళ్లి కోసం గురువారం ఎల్లమ్మగూడ నుంచి బైక్‌పై ఇచ్చోడకు వస్తున్నాడు. మేడిగూడ వద్ద ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సాజిత్‌ను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి పెదనాన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగ్గురు అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ఓ వివాహిత, రాంనగర్‌కు చెందిన ఓ యువతి, సాయినగర్‌కు చెందిన మరో యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కేఆర్‌కే కాలనీకి చెందిన వివాహిత గురువారం అదృశ్యం కాగా, రాంనగర్‌కు చెందిన యువతి గతనెల 30న, సాయినగర్‌కు చెందిన యువకుడు గురువారం అదృశ్యమైనట్లు పేర్కొన్నారు. కాగా, వారి కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఆత్మహత్యకు కారణమైన ఇద్దరికి జైలు

కడెం: గత నెల 10న కన్నాపూర్ గ్రామానికి చెందిన బొడ్డుపల్లి జ్యోత్స్న ఆత్మహత్యకు కారణమైన ఇద్దరికి జైలుశిక్ష పడినట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్ గ్రామానికి చెందిన కొండ్ర మల్లేశ్, ముక్కెర సరిత దూషించడంతో పాటు వేధించినందుకు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని జ్యోత్స్న సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దీంతో శుక్రవారం వీరిద్దరిని ఖానాపూర్ కోర్టులో హాజరుపర్చగా ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ రిమాండ్ విధించి జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి



ఐక్యత చాటుతున్న సీపీఐ, కాంగ్రెస్ నాయకులు, ఎంపీ అభ్యర్థి సుగుణ

- సీపీఐ బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణి శంకర్

ఎదులాపురం: దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణి శంకర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్స్‌లో శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ మృతికి సంతాపం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలపై దాడులకు పాల్పడుతోందని, ప్రశ్నించే గొంతులను నొక్కేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థులకు గెలుపునకు సీపీఐ సంపూర్ణ మద్దతు, సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు అహర్నిశలు కష్టపడాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎండల నేపథ్యంలో ఉదయం వేళలోనే పోలింగ్ ఎక్కువగా జరిగేలా చూడాలని సూచించారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఎస్.విలాస్, నళినీరెడ్డి, కుంటాల రాములు, నగేశ్, మేస్రం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయొద్దు



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

నిర్మల్‌టౌన్: రాజ్యాంగం, రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయొద్దని, అపహాస్యం చేసే రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. జాగో తెలంగాణ (ఓటర్ల చైతన్య) బస్సు యాత్ర శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. స్థానిక ట్యాంక్‌బండ్ వద్ద ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం అనుకూరి మురళి మాట్లాడుతూ.. ఓటర్లు ప్రలోభాలకు లొంగి ఓట్లు అమ్ముకోవద్దని, సరైన నాయకులకే ఓటు వేయాలని సూచించారు. దేశ సంపదను అదాని, అంబానీ, ఇతర పెట్టుబడీదారులకు అప్పగించి భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రమాదంలో పడేసిందని ఆరోపించారు. బస్సు యాత్రలో ప్రొఫెసర్లు కే లక్ష్మీనారాయణ, పద్మజాషా, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రామ లక్ష్మణ్, అయ్యప్ప, నాయకులు, లక్ష్మి, హరిత, జ్యోతి, అరుణ, రాజు, విజయ్, స్వదేశ్, బొర్రయ్య, పులి కల్పన, నిర్మల, స్వరూప, కళాకారులు గౌస్, రాము, అంజి, వినయ్, శివ, రైతులు, ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి జిల్లాకేంద్రంలో విక్రయిస్తున్న వ్యక్తిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు జిల్లా కేంద్రంలోని టూటౌన్‌లో శుక్రవారం ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం 8.30 గంటలకు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో డాల్డా కంపెనీ ప్రాంతంలో అనుమానం వచ్చిన ఖుర్షీద్‌నగర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ షేక్ షోహెబ్‌ను తనిఖీ చేయగా 5 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. విచారించగా డాల్డా కంపెనీ సమీపంలో ముళ్ల పొదల్లో ఓ సంచిలో 10.145 కేజీల గంజాయి దాచిపెట్టినట్లు చెప్పాడు. మహారాష్ట్రలోని కిన్వట్ నుంచి కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు తెలిపాడు. ఈ గంజాయిని ఎండబెట్టి కూలీలు, పేద ప్రజలకు అమ్మి అక్రమంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో ఈ దందాకు పాల్పడుతున్నట్లు డీఎస్పీ వివరించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.2,53,750 వరకు ఉంటుందని తెలిపారు. కాగా, నిందితుడికి గంజాయి సరఫరా చేస్తున్న మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా సుభాష్‌నగర్‌కు చెందిన షేక్ సాదిక పరారీలో ఉన్నట్లు చెప్పారు. కాగా, నిందితుడిపై గతంలోనూ గంజాయి కేసుతో పాటు పలు దొంగతనం కేసులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైనట్లు పేర్కొన్నారు. టూటౌన్ సీఐ అశోక్, క్రైమ్ పార్టీ పోలీసులు సుధాకర్‌రెడ్డి, కే నరేందర్, ఆర్ఎస్ రమేశ్, రమేశ్, ప్రవీణ్‌కుమార్, క్రాంతికుమార్ తదితరులున్నారు.

విధుల్లో లేకున్నా ఎన్నికల విధులు

- పీటీఐల అభ్యంతరం
- రద్దు లేదా రీఎంగేజ్‌కు డిమాండ్

కాసిపేట: విధుల్లో లేకున్నా ఎన్నికల విధులు కేటాయింపుపై టెర్మినేట్‌లో ఉన్న పీటీఐ(పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్)లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో పీటీఐలను ఏటా విద్యాసంవత్సరం చివరి రోజు తొలగించి విద్యాసంవత్సరం ప్రారంభమయ్యాక మళ్లీ విధుల్లోకి తీసుకుంటారు. పాఠశాలల్లో పీఈటీ, ఆర్ట్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్లుగా సేవలు అందించే వీరు పేరుకు పార్ట్‌టైం అయినా అధికారుల ఆదేశాలతో పూర్తి సమయం విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవు, సమావేశాలకు వెళ్లిన సమయంలో సైతం సర్దుబాటు చేస్తుంటారు. ఎన్నికల విధులు, పదోతరగతి పేపర్ వాల్యుయేషన్(స్పాట్), కొన్ని పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా వేస్తుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 254మంది పీటీఐలు, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2,300 మంది పీటీఐలుగా పాఠశాలల్లో పని చేస్తున్నారు. పది నెలలు పని, రూ.11,700 వేతనంతో బతుకులు వెళ్లదీస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించడంతో ప్రస్తుతం సంబంధిత అధికారులు ఎన్నికల విధులకు వీరి జాబితా సైతం పంపించారు. దీంతో వారికి ఎన్నికల విధులు కేటాయించారు. వేసవి సెలవులు కావడంతో టెర్మినేట్‌లో ఉన్న తాము ఎన్నికల విధులు ఎలా నిర్వర్తిస్తామని, తమ విధులను రద్దు చేయాలని, లేనిపక్షంలో రీ ఎంగేజ్ చేయాలని ఎన్నికల సంఘానికి విన్నవించారు. దీంతో విధుల్లోకి తీసుకోవాలని ఎన్నికల సంఘం విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీని ఆదేశించింది. కిందిస్థాయి అధికారుల వివరణ కోరారు. 20 రోజులు గడుస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదు. దీంతో మరోసారి ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించగా.. మరోమారు చెప్పడం తప్పితే తమ చేతుల్లో ఏమీ లేదనడంతో ఎన్నికల విధులకు దూరంగా ఉంటామని పీటీఐలు ప్రకటిస్తున్నారు. శిక్షణకు హాజరు కావాలని, డ్యూటీ ఆర్డర్ కాపీలు తీసుకోవాలని కింది స్థాయి అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రీఎంగేజ్ చేయడమో, ఎన్నికల విధులు రద్దు చేయడమో చేయాలని కోరుతున్నారు.

అవ్వా.. మన గుర్తు కమలం పువ్వు



'అవ్వా.. మనది కమలం పువ్వు గుర్తు.. తప్పకుండా ఓటేయాలి' అని ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ కోరారు. శుక్రవారం నేరడిగొండ మండలం లింగట్ల గ్రామంలో ప్రచారం నిర్వహిస్తూ ఓ అవ్వకు ఇలా కరపత్రంలో గుర్తు చూపించారు. అనంతరం మహిళలతో ముచ్చటించారు. బీజేపీకే ఓటేసి మరోసారి మోదీని ప్రధాని చేస్తామని ఎంపీ అభ్యర్థి నగేశ్‌కు గ్రామస్తులు తెలిపారు. దీంతో నగేశ్ వారితో సరదాగా కాసేపు మాట్లాడారు. – నేరడిగొండ